సాక్షి
నంద్యాల
శుక్రవారం ı 12 ı జనవరి ı 2024



క్షేత్రపాలకుడికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకునిగా ప్రసిద్ధి గాంచిన శ్రీబయలువీరభద్ర స్వామికి అమావాస్య సందర్భంగా శాస్త్రోక్తంగా పరోక్షసేవ విశేష పూజలను నిర్వహించారు.



పంచాయతీలకు 'ఆర్థిక' అండ

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో పల్లెల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయి.

8లో▸



పండగొచ్చింది.. ఊరు పిలిచింది

సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో ఈ పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ఇప్పటికే ఊర్లకు చేరుకున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

వాహనాల తనిఖీ తప్పనిసరి

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా ఆయా స్టేషన్ల పరిధిలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పకడ్బందీ నిఘా పెట్టాలన్నారు. రాత్రిళ్లు అనవసరంగా బయటకు వచ్చే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారికి సంబంధించిన చిరునామా సేకరించాలని సూచించారు. నైట్ బీట్ సిబ్బంది తప్పనిసరిగా చేతిలో లాఠీ ఉంచుకోవాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపివారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

నాలెడ్జ్ హబ్‌తో నైపుణ్యాల మెరుగు

- జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి

డోన్ టౌన్: కియా నాలెడ్జ్ హబ్‌తో విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరచుకోవచ్చని నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి శివారెడ్డి అన్నారు. డోన్ పట్టణం ప్రభుత్వ ఐటీఐలో నెలకొల్పిన కియా నాలెడ్జ్ హబ్‌లో యంత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్సు ఇస్తామని పేర్కొన్నారు. ఎల్ఎల్ఆర్ టెస్ట్ కోసం స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డోన్ ఎంవీఐ క్రాంతి కుమార్, ప్రభుత్వ ఐటీఐ శిక్షకులు బద్దల శ్రీధర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.



నాలెడ్జ్ హబ్‌లోని యంత్రాలను పరిశీలిస్తున్న శివారెడ్డి

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



విద్యుత్ దీపాల అలంకరణలో శ్రీశైల ఆలయం

- నేటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పంచాహ్నికదీక్షతో ఏడు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల ఆలయం ముస్తాబు అయింది. శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు శ్రీశైల మహాక్షేత్రంలో పంచాహ్నికదీక్షతో ఏడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిపేందుకు దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్షేత్రాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు విశేషంగా వాహన సేవ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉభయ దేవాలయాల్లో నిర్వహించే పలు ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేశారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకుల బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. అలాగే మహాగణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం జరిపిస్తారు. బ్రహ్మోత్సవ నిర్వహణకు అధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు, కంకణధారణ, ఋత్విగ్వరణం, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనల, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానములు, పారాయణలు నిర్వహిస్తారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠాపన, 7గంటలకు ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ఆర్జితసేవల నిలుపుదల

ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు ఆర్జిత, ప్రత్యక్ష పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, గణపతిహోమం(పరోక్షసేవ) శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం, స్వామిఅమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలు నిలుపుదల చేశారు.



బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన కార్యక్రమాలు

- బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు శనివారం నుంచి స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవలు నిర్వహిస్తారు.
- 14న భోగిరోజు ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో చిన్నారులకు సామూహిక భోగిపండ్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- 15వ తేదీ మకర సంక్రాంతి రోజున స్వామి అమ్మ వార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, మహిళలకు ముగ్గుల పోటీలు
- 17న యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ నిర్వహిస్తారు. దేవస్థాన వేదపండితులు, ఇతర దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితులచే వేదశ్రవణం
- బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన 18న పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలు జరుగుతాయి.



క్షేత్రపరిధిలో ఏర్పాటు చేసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాల స్వాగత తోరణాలు

సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తాం



శ్రీశైలక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం. శ్రీశైలక్షేత్రంతో చెంచులకు ఎంతో అవినాభావ సంబంధం ఉంది. సంక్రాంతి ఉత్సవాలకు చెంచులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. శ్రీశైల ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించి, వాహనసేవలో తరించి స్వామిఅమ్మవార్ల కృపకు పాత్రులు కావాలి. – డి.పెద్దిరాజు, ఈఓ, శ్రీశైల దేవస్థానం

నెలాఖరులోపు రీసర్వే ప్రక్రియ పూర్తి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య

నంద్యాల: జగనన్న భూహక్కు – భూ రక్ష పథకం కింద మూడవ విడతలో చేపట్టిన రీ సర్వే పనుల ప్రక్రియ ఈనెలాఖరు లోపు పూర్తిచేస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నివేదించారు. గురువారం విజయవాడ సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఎన్నికల సన్నద్ధత, ఆరోగ్యం, వైద్యం – కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పీ–ఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్, తాగునీటి సరఫరా, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, స్త్రీ – శిశు సంక్షేమం, అంగన్‌వాడీల పనితీరు, రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్ – అసైన్డ్ భూములు, ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో పాటు డీఆర్ఓ పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మూడవ విడతలో 150 గ్రామాలలో చేపట్టిన రీ సర్వే పనుల ప్రక్రియకు సంబంధించి 102 గ్రామాల్లో పూర్తయిందని మిగిలిన 48 గ్రామాలలో ఈనెలాఖరులోపు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నివేదించారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ కూడా వేగవంతంగా జరుగుతోందన్నారు. ఇనాం భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి వీఆర్ఓ, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌లలో ఉన్న వాటిని పూర్తిస్థాయి విచారణ జరిపి త్వరితగతిన క్లియర్ చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్ఓ వెంకటరమణ, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రూపేంద్ర నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు అందలం

- వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరాం
- ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా విరూపాక్షి
- హర్షం వ్యక్తం చేస్తున్న వాల్మీకి వర్గీయులు



జయరాం కర్నూలు ఎంపీ అభ్యర్థి



విరూపాక్షి ఆలూరు సమన్వయకర్త



సతీష్ కోడుమూరు సమన్వయకర్త

ఆలూరు: వాల్మీకి సామాజిక వర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇచ్చింది. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను ప్రకటించింది. అలాగే ఆలూరు నియోజకవర్గానికి సమన్వయకర్తగా చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు బోయ బూసినేని విరూపాక్షిని నియమించింది. ఈ మేరకు గురువారం రాత్రి పార్టీ అధిష్టానం ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లాలో వాల్మీకులకు పెద్ద పీట వేశారు. జిల్లా అధ్యక్ష పదవిని అదే సామాజిక వర్గానికి చెందిన కర్నూలు నగర మేయర్ బీవై రామయ్యకు అప్పగించారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదివిని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు మద్దూరి సుభాష్ చంద్రబోస్‌కు కట్టబెట్టారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా డాక్టర్ మధుసూదన్‌ను గెలిపించారు. ఆదోని మున్సిపాలిటీ పాలనా పగ్గాలను బోయ శాంతకు అప్పగించారు. ఆలూరు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మనూరు జయరాంకు రెండు విడతల్లోనూ మంత్రి పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా ప్రస్తుతం కర్నూలు ఎంపీ అభ్యర్థిగా గుమ్మనూరును ప్రకటించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మంచి పేరు తెచ్చుకున్న చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు బోయ బూసినేని విరూపాక్షికి ఆలూరు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. టీడీపీ ఒక వైపు టిక్కెట్లు అమ్ముకుంటూ.. కార్యకర్తలకు, నాయకులకు మొండిచేయి చూపుతోంది. గత ఎన్నికల్లో వాల్మీకులకు అసెంబ్లీ టికెట్ కేటాయించకుండా అన్యాయం చేసింది. బీసీల పార్టీ అని చెప్పుకుంటూ బడుగులను అణగదొక్కుతోంది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టపడే కార్యకర్తలను, నాయకులను పైకి తీసుకొస్తోంది. పార్టీని నమ్ముకున్న వారికి పదవులు కట్టబెడుతోంది.

కోడుమూరు సమన్వయకర్తగా డాక్టర్ సతీష్

కోడుమూరు: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం రాత్రి పార్టీ అధిష్టానం ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రి ఆదిమూలపు సురేష్‌కు డాక్టర్ సతీష్ స్వయానా సోదరుడు. వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో కోడుమూరు నియోజకవర్గంలో డాక్టర్ సతీష్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో పార్టీ ఈయను వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించింది. తనపై ఉన్న నమ్మకంతో కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, సహకారం అందించిన కుడా చైర్మన్ కోట్ల హర్ష వర్ధన్‌రెడ్డికి రుణపడి ఉంటానని సతీష్ తెలియజేశారు.

చిరువ్యాపారులకు 'జగనన్న తోడు' వరం

- జిల్లా 14,763 మంది లబ్ధిదారులకు రూ.31.55 లక్షలు జమ
- లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేసిన జెడ్పీ చైర్మన్, జాయింట్ కలెక్టర్



చెక్కును అందజేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

నంద్యాల: చిరువ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కునేందుకు జగనన్న తోడు పథకం వరంగా మారిందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం కింద రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిన్న, చిన్న చిరు వ్యాపారులకు 8వ విడత కింద వడ్డీ లేని రూ.417.94 కోట్ల రుణాలను అందజేశారు. అలాగే గతంలో ఈ పథకం ద్వారా రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన వారికి రూ. 13.64 కోట్ల వడ్డీ మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని లైవ్ ద్వారా నంద్యాల జిల్లా నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, తదితరులు వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తోన్న జగనన్న తోడు ఆర్థిక సహాయాన్ని చిరు వ్యాపారులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వడ్డీలు, చక్ర వడ్డీలు కట్టలేక అవస్థలు ఎదుర్కొంటున్న చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి జగనన్న తోడు పథకం ఆసరాగా నిలుస్తుందన్నారు.

- జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారుల కష్టాలు తీర్చేందుకు జగనన్న తోడు పథకం క్రింద నంద్యాల జిల్లాలో రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 14,763 మంది లబ్ధిదారులకు వడ్డీ రియంబర్స్‌మెంట్ కింద రూ.31.55లక్షలు జమ చేశామన్నారు. అంతేగాకుండా జగనన్న తోడు కింద 8వ విడత 14,142 మందికి రూ.14.96 కోట్లు వడ్డీలేని రుణాలు అందజేశామన్నారు. ఇంకా ఏవరైనా అర్హత ఉండి కూడా పథకం అందకపోతే వారికి కూడా లబ్ధి చేకూరుస్తామన్నారు. జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు పెట్టుబడితో పాటు జీవనోపాధికి ఉపయోగపడుతోందన్నారు. జిల్లాలో జగనన్న తోడు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1712 మంది లబ్ధిదారులకు రూ.3.56 లక్షలు, బనగానపల్లెలో 1939 మందికి రూ.3,88 లక్షలు, డోన్‌లో 2539 మందికి రూ.5.61 లక్షలు, నందికొట్కూరులో 3014 మందికి రూ.6.90 లక్షలు, నంద్యాలలో 2576 మందికి రూ.5.2 లక్షలు, పాణ్యంలో 848 మందికి రూ.1.58 లక్షలు, శ్రీశైలంలో 2139 మందికి రూ.4.97 లక్షలు, మొత్తం 14,763 మంది లబ్ధిదారులకు రూ.31.55 లక్షలు నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు.
- మైనారిటీ సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవిస్తూ మరో ఇద్దరికి సైతం కూడా ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో పాటు అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా జగనన్న తోడు అండగా నిలబడుతుందన్నారు. చిరువ్యాపారులకు జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలు లబ్ధిదారుల సమక్షంలో జగనన్న తోడు చెక్కును విడదల చేశారు.

చీరల వ్యాపారానికి ఎంతో ఆసరా



జగనన్న తోడు పథకం కింద వడ్డీ లేని రుణాన్ని మూడో సారి తీసుకుంటున్నాను. మొదటి సారి రూ.10వేలు, రెండో సారి రూ.11వేలు, ఈ ఏడాది రూ.13వేలు నా ఖాతాలో జమ అయ్యాయి. నా కూతుర్ని కష్టపడి చదివించుకంటున్నాను. జగనన్న తోడు ప థకం కింద డబ్బులు వస్తుండటంతో వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నాను. ఇది మా కుటుంబానికి చాలా ఉపయోగపడు తుంది.


– ఏ.లక్ష్మీదేవి, కొణిదేడు, పాణ్యం మండలం

జగనన్న తోడు పథకం చాలా మంచిది



పట్టణంలోని ఘట్టాల్‌నగర్‌లో నివాసం ఉంటున్నాను. మా భర్త హమాలీ పని చేస్తారు. నేను మా ఇంట్లోనే మహిళలకు కావాల్సిన వన్‌గ్రామ్ కమ్మలు, చైన్‌లు ఇతర అలంకరణ వస్తువులు అమ్ముతాను. జగనన్న రెండో సారి తోడు పథకం కింద రూ.11వేలు అందజేశారు. ఈ పథకం వల్ల మాకెంతో ఉపయోగం. ప్రభుత్వం ఇచ్చే రూ.10వేలతో వ్యాపారం చేసుకుంటూ నెల నెలా కంతు కట్టేందుకు సులభంగా ఉంటుంది. మా లాంటి చిరువ్యాపారులకు ఈ పథకం చాలా మంచిది. – షేక్ హని, వ్యాపారి, నంద్యాల

మణిహారం .. నగరవనం



పార్కులో ఏర్పాటుచేసిన నెమలి, జింక ప్రతిమలు

- పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న వైనం
- 67 హెక్టార్లలో రూ.3 కోట్లతో నగరశివారులో ఏర్పాటు

డోన్: నాణ్యమైన విద్య, కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ప్రభుత్వం.. ప్రజలకు మానసిక ప్రశాంతత కల్పించేందుకూ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా డోన్ నియోజకవర్గ ప్రజలకు నగరవనంతో పాటు టూరిజం పార్కులను అభివృద్ధి చేస్తోంది. దైనందిక జీవితంలో ప్రజలు ఎదుర్కొనే మానసిక ఒత్తిళ్లు, సమస్యలు, సవాళ్లను అధిగమించేందుకు మానసిక ఉల్లాసం ఎంతో అవసరం. ఉరుకుల పరుగుల యాంత్రిక జీవితంలో ఎదురవుతున్న తీవ్ర ఒత్తిళ్లను అధిగమించేందుకు సాయంత్రం ఆహ్లాదమైన వాతావరణంలో సేదతీరేలా నగరవనాన్ని అభివృద్ధి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో మండల పరిధిలోని ఎర్రగుంట్ల వద్ద రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన నగరవనం డోన్‌కు మణిహారంగా మారింది. డోన్ నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల వద్ద 67 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో అటవీశాఖ అధికారులు నగరవనాన్ని ఏర్పాటుచేశారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జిల్లా అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నగరవనం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విద్యుత్, తాగునీటి సౌకర్యం, ప్లే గ్రౌండ్, పిల్లల కోసం ఉయ్యాలలు, బ్యాలెన్సింగ్ బెంచీలు, రంగులరాట్నం, జాయింట్ వీల్స్, పెద్దల కోసం జిమ్, యోగా సెంటర్లు, రెస్టారెంట్ తదితర సౌకర్యాలు ఉండటంతో వనాన్ని సందర్శించేందుకు ప్రజలు క్యూ కడుతున్నారు. వారాంతపు సెలవు దినాల్లో 250 నుంచి 300 మంది వరకు సందర్శకులు వస్తున్నారు.



ఆకర్షిస్తున్న ఐలవ్ ఫారెస్ట్ బోర్డు



నగరవనం ముఖద్వారం



నగరవనంలో ఆటలాడుతున్న పిల్లలు

మరింత అభివృద్ధికి కృషి



పార్కులో రియల్‌లైఫ్ యాని మల్స్‌ను ఏర్పాటుచేస్తున్నాం చెట్లు ఏపుగా పెరిగి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెద్దలు, పిల్లలను మరింతగా ఆకర్షించే విధంగా వనాన్ని తీర్చిదిద్దుతాం.

– ప్రవీణ్‌కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, డోన్



జొన్న పంటకు మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

మూడు గంటల్లో 30 ఎకరాలు

వ్యవసాయంలో రైతులకు పెట్టుబడుల భారం ఒక సమస్య అయితే కూలీల కొరత మరింత వేధిస్తుంది. జొన్న మొక్క దాదాపు ఐదారు అడుగులు పెరుగుతుంది. ఈ క్రమంలో చీడపీడలు ఆశించినా క్రిమి సంహారక మందు పిచికారీ చేయలేక వదిలేస్తారు. అయితే క్రిష్టిపాడు గ్రామంలో గురువారం విభూదిరెడ్డి డ్రోన్ సహాయంతో సమస్యను అధిగమించారు. ఇతను 30 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశాడు. ఈ పంటకు కూలీలతో పురుగు మందును పిచికారీకి ఒక్కో కూలీకి రూ.700 ఇవ్వాలి. ఎకరాకు ఇద్దరు కూలీలకు రూ.1,400 చెల్లించాల్సి వస్తుంది. 30 ఎకరాలకు కూలీల ఖర్చు రూ.42 ఖర్చు వస్తుంది. దీంతో డ్రోన్ ద్వారా ఎకరానికి రూ.500 చొప్పున అద్దె చెల్లించి 30 ఎకరాలను కేవలం మూడు గంటల్లోనే రూ. 15వేల ఖర్చుతో మందు పిచికారీ చేయించాడు. డ్రోన్ నిర్వాహకులు దగ్గరుండి బ్యాటరీ చార్జింగ్, మందు మోతాదు తదితరాలు వారే చూసుకుంటారు. – దొర్నిపాడు



డ్రోన్‌లో క్రిమిసంహారక మందును పోస్తున్న దృశ్యం

క్లుప్తంగా

పండ్లతోటల అభివృద్ధికి రైతులను గుర్తించండి


జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరంలో పండ్ల తోటల అభివృద్ధికి రైతులను గుర్తించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఏపీడీలు, ఏపీ ఓలు, ఈసీలను ఆదేశించారు.గురువారం తన కార్యా లయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాధాన్యత అంశాలపై వెంటనే దృష్టి సారించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 10 వేల ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతుల ను గుర్తించాలన్నారు. అదే విధంగా ప్రతి మండలంలో ఎకరా విస్తీర్ణంలో 5–10 అమృత్ సరోవర్‌లను నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. గొర్రెలు, మేకల షెడ్‌ల నిర్మాణాలకు సైతం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్టిమేట్లు వేసి పంపితే జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు తీసుకుంటామన్నారు.

జిల్లాకు 31 పతకాలు

కర్నూలు (టౌన్): ఈనెల 8న విశాఖపట్నం రైల్వే స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు 31 పతకాలు సాధించినట్లు మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి రెడ్డి తెలిపారు.

ప్రతి స్త్రీ జగన్మాత స్వరూపమే

● బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు


ప్రవచనం చెబుతున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: లోకంలో ప్రతి స్త్రీ జగన్మాత స్వరూపమే అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎస్‌ఏపీ క్యాంపులోని టీజీ వెంకటేష్ అవుట్ డోర్ స్టేడియంలో గురువారం రెండో రోజు జగన్మాత వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం చెప్పారు. ప్రతి ఒక్కరూ అమ్మవారిని స్మరించాలన్నారు. లోక కల్యాణం కోసం దేవుడు ఏ రూపంలో అవతరించినా జగన్మాత ఆయన కష్ట సుఖాల్లో పాలుపంచుకునేందుకు భార్యగా అవతారం పొందారన్నారు. పురుషుడు ఎంత గొప్పవాడైనా భార్య లేకపోతే పుణ్యం సంపాదించు కోలేడన్నారు. దాంపత్యం రెండు శరీరాలుగా కనిపించినా ఇద్దరి మనసులు ఒక్కటే అన్నారు. తల్లి ఏమీ ఆశించకుండా తన బిడ్డను ప్రేమిస్తుందని, బిడ్డ అభ్యున్నతిని కోరుకునే త్యాగమూర్తి తల్లి ఒక్కటే అని మాతృత్వం గురించి వివరించారు.

● నగర శివారులోని డోన్ రోడ్డులో ఉన్న గాయత్రి గోశాలలో గురువారం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సహస్ర గోప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీవితంలో మొదటిసారి తాను వెయ్యి గోవులకు ప్రదక్షిణ చేసినట్లు వెల్లడించారు. వారంలో ఒకసారి ప్రతి ఒక్కరూ గోసేవలో పాల్గొనాలన్నారు.

పండగొచ్చింది.. ఊరు పిలిచింది

● సెటిలర్ గ్రామాల్లో సంక్రాంతి సందడి
● పల్లెలకు చేరుకుంటున్న బంధుగణం
● మూడు రోజులు సంతోషాల వేడుక


అమ్మిరెడ్డినగరం వ్యూ


పిండివంటలు చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: అందమైన ముగ్గులు.. గొబ్బెమ్మలు.. హరిదాసు పాటలు.. బసవన్న ఆటలు.. పిండివంటలు.. ఆటపాటలు.. కుటుంబీకుల సరదాలు.. అన్నీ కలసి వెలిసిన పండుగ సంక్రాంతి. ఇది పంటల పండుగ అని కొందరు.. మార్పు తెచ్చే పండుగా అని మరి కొందరు.. అలాగే పెద్దల పండుగ అంటూ నిర్వహిస్తారు. మన పూర్వీకులు 33 రోజులు ఈ పండుగను జరుపుకొనే వారట. ఇప్పుడు అంత సమయం లేక మూడు రోజులు జరుపుకుంటున్నారు. సంక్రాంతి సంబరాలకు కోస్తాంధ్రలో అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఆ ప్రాంతానికి చెందిన కొందరు వ్యవసాయం చేసుకునేందుకు కొన్నాళ్ల క్రితం జిల్లాలోని దొర్నిపాడు మండలానికి చేరుకు ని స్థిరపడ్డారు. అలా స్థిరపడిన వారి నివాసాలు కొన్ని గ్రామాలుగా మారాయి. ప్రస్తుతం సెటిలర్స్ గ్రామాలుగా పేరొందడం, ఆయా గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిచండం ఆనవాయితీగా వస్తోంది. మండలంలో భాగ్యనగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, ఉమాపతినగరం, వెంకటేశ్వరనగరం గ్రామంలో ఈ పండుగను ఎంతో విశిష్టంగా జరుపుతారు. పండుగకు ముందే ఆయా గ్రామాల్లో సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉన్న వారి కుటుంబాలు ఇప్పటికే ఊరికి చేరుకోవడంతో పండుగ కళ కనిపిస్తోంది.

ఊరూరా కోలాహలమే..

సుమారు ఆరు దశాబ్దాలుగా భాగ్యగనరం, ఉమాపతి నగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, వెంకటేశ్వరనగరం గ్రామస్తులు ఈ పండుగను సంప్రదాయంగా జరుపుకుంటారు. భోగి రోజున వేకువ జాము నుంచే భోగి మంటలు వేసి సంక్రాంతికి ఆహ్వానం పలుకుతారు. అనంతరం చిన్నారులకు భోగి పండ్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నాటుకోడి చికెన్ దోశలు ఆ రోజు ప్రత్యేక వంటకం. అనతంరం ఇండ్లన్నీ శుభ్రం చేసుకుని సంక్రాంతి రోజున ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేస్తారు. అనంతరం తీపి వంటలు చేసి నూతన దుస్తులు ధరించి పెద్దలకు నూతన బట్టలు పెట్టి మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే గ్రామంలోని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి తెప్పోత్సవం నిర్వహిస్తారు. కనుమ రోజు ఇంటింటా ప్రత్యేక వంటలు చేసుకోని ఆరగిస్తారు. పార్వేటగా కోళ్లు, మేకలను వదలడం ఎవ్వరు పట్టుకుంటే వారికి ఇవ్వడం వంటి పందెలను కొనసాగించి ముగింపు పలుకుతారు.

అంతటా పిండి వంటల ఘుమఘుమలు.

సంక్రాంతి పండగ అంటే పిండివంటలు ప్రత్యేకం. మురుకులు, అరిసెలు, కొబ్బెరి బూరెలు (అత్తరాసెలు) ఉప్పు చెక్కలు, లడ్డు, కారాలు, వాముపూస ఇలా ఎన్నో రకాల పిండివంటలను తయారు చేస్తారు. పండుగకు ముందే వీటి తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. ఊరూరా పిండి వంటల ఘుమఘుమలు ఆహ్వా నం పలుకుతాయి. కుటుంబ సభ్యులతో పాటు బంధువులతో కలసి పండుగ చేసుకోవడంతో పాటు, తిరిగి వెళ్లేటప్పుటు వెంట పంపించడానికి సరిపడ పిండి వంటలు తయారీ చేస్తారు.

అందరం కలిస్తేనే పండుగ



గ్రామంలో మా కుటుంబానికి ఎంతో ప్రత్యేక ఉంది. కొడుకులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, బంధువులు ఇలా అందరూ మొత్తం 50 మంది కలిసి పండుగను చేసుకుంటాం. అందుకే పండుగకు వారం ముందే పిండివంటలు సిద్ధం చేస్తాం. మా తాళ్లూరి కుటుంబం అంతా వెళ్లి 60 కిలోల బెల్లం, 60 కిలో చెక్కెర, 100 లీటర్ల నూనె, నెయ్యి ఇలా కావాల్సి సరుకులను తీసుకువస్తాం . ఇక వంటలకు కావాల్సిన పిండిని మా ఇంట్లో ఉన్న వాటినే ఉపయోగిస్తాం. అందరం కలసి మూడు రోజులు పండుగను ఘనంగా నిర్వహిస్తాం.

– తాళ్లూరి విజయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్, భాగ్యనగరం

సంక్రాంతి మాకు చాలా ప్రత్యేకం



అన్ని పండుగలకంటే సంక్రాంతిని మేము ప్రత్యేకంగా జరుపుకుంటాం. సంప్రదాయంగా జరుపుకోనే ఈ పండుగను చిన్నారుల నుంచి పెద్దల వరకు సంతోషంగా గడుపుతారు. ఇళ్ల నిండా చుట్టాలతో సందడిగా మారిపోతుంది. ఇప్పటికే పిండి వంటల పనుల్లో మేము బిజీగా ఉన్నాం. ఉద్యోగాలు, వ్యాపారాలు అంటూ తలో చోట ఉన్నారు. పండుగకు అందరూ ఒక చోట చేరుకోవడం ఆనందంగా ఉంటుంది. పిల్లల ఆటలు, పెద్దల సరదాల మాటలు, పార్వేట ఉత్సవంతో ఊరంతా కళకళలాడుతోంది.

– ప్రమీల, అమ్మిరెడ్డినగరం

ఆరుగురికి కోవిడ్ పాజిటివ్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా మరో ఆరుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మొత్తం 54 మందికి కోవిడ్ వైద్యపరీక్షలు నిర్వహించగా మెడికల్ ఓపీలో ఇద్దరికి, పీడియాట్రిక్స్‌లో ఒకరికి, ఏఎంసీ, ఫిమేల్ మెడికల్ వార్డులో ఒక్కొక్కరికి పాజిటివ్ వచ్చినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఒకరిని అడ్మిషన్‌లో ఉంచి చికిత్స చేస్తున్నారు.

లారీ కిందపడి మహిళ దుర్మరణం


మృతురాలు పద్మావతమ్మ (ఫైల్)

గడివేముల: లారీ కింద పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం మండల కేంద్రమైన గడివేములలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరు మండలం చెరుకుచెర్ల గ్రామానికి చెందిన తంబల కస్తూరయ్య, భార్య పద్మావతమ్మ (58), మనవరాలు త్రిపురతో కలిసి ఎక్సెల్–100 వాహనంపై మహానంది వెళ్తున్నారు. గడివేములలోని సినిమా హాలు సమీపంలో కర్ణాటక నుంచి జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి ముడిసరుకు తీసుకెళ్తున్న లారీ ట్రైలర్ (కేఏ35బీ9774) ఢీ కొట్టడంతో పద్మావతమ్మ వెనక ఉన్న టైర్ల కింద పడిపోయింది. టైర్ల కిందపడిన మహిళను చూసుకోకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని ముందుకు నడపగా మృతదేహం నుజ్జునుజ్జయింది. భర్త, మనవరాలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. భార్య మృతదేహం వద్ద భర్త విలపిస్తున్న దృశ్యాన్ని పలువురిని కంటతడి పెట్టించింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ప్రమాదంలో మహిళ మృతిచెందడంతో ఒక్కసారిగా గ్రామస్తులు కోపోద్రేక్తులై లారీ అద్దాలను పగలగొట్టి, నంద్యాల – నందికొట్కూరు రహదారిపై రాళ్లను అడ్డంగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. గతంలో మూడు ప్రమాదాలు జరిగాయని గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా చూడాలని పలువురు కోరారు. డ్రైవర్ పారిపోగా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి పూజ

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస అమావాస్యను పురస్కరించుకుని గురువారం కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ, లక్ష్మీగణపతి మూలమంత్ర సహిత చండీహోమం తదితర పూజలను విశేషంగా నిర్వహించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

భక్తుని చెంతకే భగవంతుడు

● వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
● ఉభయ దేవేరులతో బీగాల ఆంజనేయ స్వామి సన్నిధికి తరలివచ్చిన ప్రహ్లాదవరదుడు


ఆంజనేయ స్వామి సన్నిధిలో కొలువైన ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు,


ఉత్సవమూర్తి ఆంజనేయస్వామి

ఆళ్లగడ్డ: హనుమజ్జయంతి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో వెలసిన బీగాల ఆంజనేయస్వామి జయంతి మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. ధనుర్మాసం వైగత్ వాయిర్వగల్ పాశురం తొండర అడిపొడి ఆళ్వారు తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని వార్షిక హనుమత్ జయంతిని దిగువ అహోబిల క్షేత్రంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం తెల్లవారు జామున ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో ఉత్సవ పల్లకీలో కొలువై ఊరేగింపుగా దిగువ అహోబిలం దేవాలయం ఎదురుగా ఉన్న బీగాల ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామి అమ్మవార్ల సమక్షంలో ఉత్సవ మూర్తి ఆంజనేయ స్వామికి నవకళశాలతో అభిషేకించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి అమ్మవార్లకు నవకళశస్థాపన, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఆస్థాన గోష్టి నిర్వహించారు. ప్రహ్లాదవరద స్వామి, అమ్మ వార్లను పట్టు పీతాంబరాలతో ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి రాత్రి వరకు ఆంజనేయ స్వామి సన్నిధిలోనే కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమాలు ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రత్యేకత ఇదీ

పూర్వం మహాదండకారణ్యంలో ఉన్న అహోబిల క్షేత్రంలో దొంగల భయానికి దిగువ అహోబిలంలో రాత్రి పూట గుడిదగ్గర కాపలాగా ఎవరూ ఉండేవారు కాదు. దీంతో చీకటి పడిన వెంటనే గుడికి తాళాలు వేసి తాళం చెవులు ఆంజనేయ స్వామి గుడిలో ఉంచి వెళ్లేవారు. ఉదయం పూజరులు వచ్చి తాళాలు తీసుకుని గుడి తెరిచేవరకు ఆంజనేయ స్వామే శ్రీప్రహ్లాదవరదస్వామి గుడికి కాపాల ఉండే వాడని ప్రజల విశ్వాసం. అందుకే అక్కడ స్వామి గుడికి ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామిని బీగాల అంజనేయ స్వామి అని పిలుస్తారు. దీంతో ఏటా ధనుర్మాసంలో వచ్చే హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు స్వయంగా హనుమంతుడు కొలువైన గుడి దగ్గరకు వేంచేసి ఆంజనేయ స్వామిని ఆశీర్వదించేలా పూజలు నిర్వహిస్తారు.

డిగ్రీ పరీక్షల్లో 445 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షకు 445 మంది విద్యార్థుల గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉదయం సెషన్‌లో జరిగిన ఒకటవ సెమిస్టర్ పరీక్షకు 3,830 మందికి గాను 3,385 మంది హాజరు కాగా 445 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. చూచిరాతలకు పాల్పడిన కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, కర్నూలు ఆర్‌సీ రెడ్డి డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఎమ్మిగనూరు ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, పత్తికొండ విజయసాయి డిగ్రీ కళాశాల, కర్నూలు సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 12 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌బీకేల పనితీరు పరిశీలనకు ప్రత్యేక వ్యవస్థ

● పర్యవేక్షకులుగా ముగ్గురు ఏడీఏలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతు భరోసా కేంద్రాల పనితీరును అధ్యయనం చేసేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశాల మేరకు ప్రతి మండలానికి ఒక వ్యవసాయ అధికారిని నియమిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా.. వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలన్నింటినీ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. రసాయన ఎరువులను కూడా ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తోంది. ఆర్‌బీకేలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి.. ఎరువుల నిల్వలు.. అమ్మకాలు.. విక్రయాలు.. రైతుల అభిప్రాయం ఏ విధంగా ఉందనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లా వనరుల కేంద్రం, సీడ్ ఫామ్, సీడ్, సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, వైఎస్ఆర్ అగ్రి ల్యాబ్‌ల్లో పని చేస్తున్న 25 మంది వ్యవసాయ అధికారులను ప్రతి మండలానికి ఒకరి ప్రకారం నియమించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వేదమణి, భూసంరక్షణ విభాగం ఆదోని ఏడీఏ సంధ్యారాణి, ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ శైలకుమారిలను పర్యవేక్షులుగా నియమించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఆర్‌బీకేల పనితీరును అధ్యయనం చేస్తారు.

అత్యవసరమైతేనే ఏఎంసీ విభాగానికి పంపండి

కర్నూలు(హాస్పిటల్): రోగులను అత్యవసరమైతేనే ఏఎంసీ విభాగానికి పంపించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి సూచించారు. గురువారం మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ హాలులో వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ కేసులను ఆయా విభాగాల్లోనే చికిత్స అందించాలని హెచ్ఓడీలకు ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రతిరోగికి సంబంధించిన ప్రతి చికిత్సా వివరాలను కేస్‌షీట్‌లో రాయాలన్నారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయని వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కేస్‌షీట్‌లో రాసే వివరాలు రోగి చికిత్సతో పాటు భవిష్యత్‌లో కేస్‌స్టడీలకు, మరణాలపై సమీక్షకు ఉపయోగపడతాయన్నా రు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకా దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'స్వచ్ఛ'తలో మెరిసిన కర్నూలు

కర్నూలు (టౌన్): శుభ్రత సర్వే స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల్లో కర్నూలు నగరం మెరిసింది. కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరానికి ర్యాంకులను ప్రకటించింది. రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు మొదటి నాలుగు స్థానాలను దక్కించుకోగా.. కర్నూలు నగరం ఐదో ర్యాంకును కైవసం చేసుకుంది. జాతీయ స్థాయిలో 32వ ర్యాంకు వచ్చిందని కమిషనర్ భార్గవ్‌తేజ గురువారం వెల్లడించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజారోగ్య సిబ్బంది బాగా పని చేయడం వల్లే ఈ ర్యాంకు సాధ్యమైందన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

కర్నూలు: కర్నూలు ఏసీబీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన 1993లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. నన్నూరు టోల్‌ప్లాజా వద్దనున్న రాగమయూరిలో నివాసముంటున్నారు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక గురువారం మరణించారు. ఈయనకు భార్య కాశీ లక్ష్మీతో పాటు కొడుకు, కూతురు సంతానం. కుమారుడు ప్రణయ్‌కుమార్ రెడ్డి ఇటీవల ఎస్ఐగా ఎంపికయ్యారు. కర్నూలు పాతబస్తీలోని జమ్మిచెట్టు శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, దిశ మహిళా పీఎస్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సీఐలు కృష్ణారెడ్డి, నాగరాజు యాదవ్, తేజేశ్వరరావు, గౌతమి, ఇంతియాజ్ తదితరులు ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పంచాయతీలకు 'ఆర్థిక' అండ

● 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12.43 కోట్లు విడుదల
● 14 మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.1.64 కోట్లు
● మిగిలిన 469 గ్రామ పంచాయతీలకు రూ.10.78 కోట్లు
● పీఎఫ్ఎంఎస్ ద్వారా నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ



కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యా యి.దీంతో ఆయా పంచాయతీల అభివృద్ధికి 'ఆర్థిక' అండ లభించినట్లు అయ్యింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇతోధికంగా నిధులను విడుదల చేస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రూ.40 లక్షల విలువ చేసే పనులను చేపడుతోంది. అలాగే ప్రతి మండలానికి రూ. 60 లక్షలను కూడా మంజూరు చేసింది. ఈ నిధులకు తోడు 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ అవుతున్న నేపథ్యంలో పల్లెల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కానున్నాయి.

పరుగులు పెట్టనున్న అభివృద్ధి

జిల్లాల్లో మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో 15 మేజర్, 469 మైనర్ పంచాయతీ లు ఉన్నాయి. ఆదోని డివిజన్‌లోని మండగిరి మేజర్ గ్రామ పంచాయతీలో ఎన్నికలు నిర్వహించనందున మిగిలిన 483 గ్రామ పంచాయతీలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు అన్‌టైడ్ గ్రాంట్ 2వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.12,43,37,141 విడుదలయ్యాయి. ఈ నిధుల్లో 14 మేజర్ గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.1,64,44,215 కేటాయించారు. మిగిలిన మైనర్ గ్రామ పంచాయతీలకు రూ.10,78,92,926లు విడుదలయ్యాయి. అన్ని గ్రామ పంచాయతీలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాలు ఓపెన్ చేసిన నేపథ్యంలో పీఎఫ్ఎంఎస్ సిస్టమ్‌లో ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోకి ఈ నిధులు జమ అయ్యాయి.

స్థానిక అవసరాలకు పెద్దపీట

ప్రస్తుతం విడుదలైన 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులతో పంచాయతీల్లో నెలకొన్న అవసరాలను తీర్చుకునేందుకు వెసులు బాటు ఉంది. ముఖ్యంగా ఈ నిధుల్లో 25 శాతం నిధులను థీమ్ ఆధారంగా గ్రామాభివృద్ధికి సంబంధించి చేసిన సంకల్పానికి, మిగిలిన 75 శాతం నిధులను ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించుకునేందుకు అవకాశం ఉంది.

నిధుల సర్దుబాటు



జనాభా ప్రాతిపదికన జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు సర్దుబాటయ్యాయి. 2వ విడతగా అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.12,43,37,141 విడుదలయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీలు ఈ నిధులను వినియోగించుకోనున్నాయి. ప్రధానంగా ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి చేసుకున్న సంకల్పం మేరకు నిధులను వినియోగించుకునే సౌలభ్యం ఉంది. –టీ నాగరాజునాయుడు, డీపీఓ

శ్రీశైల ఆలయంలో నాగుపాము


నాగుపామును పట్టుకుంటున్న కాళీచరణ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో గురువారం నాగుపాము భక్తులను భయాందోళనకు గురి చేసింది. ఆలయంలోని మనోహరగుండం సమీపంలో నాగుపాము కనపించడంతో భక్తులు చూసి దేవస్థాన సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్నేక్‌క్యాచర్ కాళీచరణ్ కుమార్ ఆలయం వద్దకు చేరుకుని నాగుపామును పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

విధుల్లో చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

కర్నూలు సిటీ: ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెను విరమించి గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారు డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. అధ్యయనం చేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారందరినీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌గా మార్చేందుకు, అనుభవం ఆధారంగా మినిమమ్ టైమ్ స్కేల్‌ను దశల వారీగా అమలు చేసేందుకు మంత్రులు హామీ ఇచ్చారన్నారు. హెచ్ఆర్‌పీ విధానం అమలుకు కమిటీ ఏర్పాటు చేస్తామని, ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ అమలు చేస్తామని, సమ్మె కాలానికి జీతాలు చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారన్నారు.

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం
ఆర్.యస్.రంగాపురం గ్రామం, బేతంచెర్ల మండలం, నంద్యాల జిల్లా.

సీల్డు టెండరు కం బహిరంగ వేలం ప్రకటన

(1) శ్రీ స్వామి వారికి భక్తులు సమర్పించిన తలనీలాలు 09-09-2023 నుండి 29-09-2023 వరకు ప్రోగు చేసి, అరబెట్టిన నిలువ ఉంచిన తలనీలాలు కొనుగోలు కొరకు తేది: 22-01-2024 ఉ॥ 10.00 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడును.
(2) పై దేవస్థానము పరిసరాలలో తేది: 01-03-2024 నుండి 30-06-2024 వరకు చలువ పందిర్లు వేయుటకు, అర్హత, ఆసక్తి గల సంస్థల నుండి సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది.
వివరములకు దేవస్థాన కార్యాలయ పనివేళల్లో సంప్రదించగలరు.

తేది: 11-01-2024
ఇట్లు: కార్యనిర్వహణాధికారి మరియు చైర్మన్ & ధర్మకర్తల మండలి, సెల్: 94933 00007

WANTED PRINCIPAL / FACULTY
☆ PRINCIPAL (Female)
☆ LECTURERS
in Physics, Chemistry, Zoology, Botany, English, Sanskrit
Minimum 2 Years Exp. in Any Jr. College.
Courses: BiPC+NEET, BiPC+EAMCET
WISDOM MEDICAL ACADEMY
NEET/EAMCET/INTEGRATED
Address: Opp: Kurnool Medical College, Budhawarpet, Kurnool. Cell: 91771 77289

సాక్షి ఉద్యోగ అవకాశాలు
FULL TIME DOCTOR REQUIRED
For Sri Swaraj Medicals Near Viswabharathi Hospital, Gayatri Estate, Kurnool.
• General Physician
• Pediatrician
• Endocrinologist
• Skin Specialist
Cell: 94408 64144

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE DEGREE & PG
■ Degree: B.Com - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLISc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLISc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: 90306 28410, 93937 28410. [L-806314]

(SSC-GD) ఉచిత శిక్షణ
■ 26,146 SSC-GD ఉద్యోగాలకు అప్లయి చేసిన వారికి మాత్రమే. 23 సం॥రాల అనుభవం గల సంస్థ స్టార్ కోచింగ్ సెంటర్, నంద్యాల. సెల్: 8790844959 (హాస్టల్ కలదు). [L-806311]

REAL ESTATE

PLOT FOR SALE
■ వేగంగా అభివృద్ధి అవుతున్న కర్నూలు-నందికొట్కూరు మెయిన్ రోడ్డులో కుడ అప్రూవుడ్‌తో నంద్యాల చెక్‌పోస్ట్‌కు 4 కి.మీ. దూరంలో ఓపెన్ ప్లాట్లు బ్యాంక్ లోన్‌తో కలవు. సెల్: 9533049765. [L-822303]
■ శ్రీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్: కర్నూలు–హైదరాబాద్ రోడ్‌లో మహేంద్ర షోరూం ప్రక్కన మెయిన్ రోడ్ 2BHK & 3BHK లగ్జరీ ఫ్లాట్స్ మరియు దూపాడు రిడ్జ్ స్కూలు దగ్గర 30x50 సైజుగల ఓపెన్ ప్లాట్లు, గేటెడ్ కమ్యూనిటీ కలదు. 90301 13559. [L-806313]

HOUSE FOR SALE
■ కర్నూలు – నంద్యాల రోడ్, సఫా కాలేజీ, రింగ్ రోడ్డు దగ్గర, మెయిన్ రోడ్‌కు 3 సెంట్లలో ఇల్లు కట్టించి ఇవ్వబడును. & ఓర్వకల్లులో ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్ర: 99638 00314 [L-822306]
■ బాలాజీ నగర్‌లో ఉత్తరం 7.5 సెంట్లలో 2 షాపులు 3 కార్లు పార్కింగ్‌తో హోమ్ థియేటర్ పెట్టుకోగల 25 అడుగుల హాలుతో 10 రూముల ఇల్లు అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్-8919868887. [L-806304]

SERVICES

ASTROLOGY
■ దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: ఎస్.వి. రాఘవేంద్ర జోషి, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపగలరు. ✆ 6364 999 444 [B-1255221]

WANTED
■ J.M. కంప్యూటర్స్ నందు 5 సం॥ల అనుభవం గల కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్, అకౌంటెంట్ (కంప్యూటర్స్ విత్ టాలీ), మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం: 25–30 వేలు ఆపైన. సంప్ర: # 1, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, Opp: క్రేజీ బాయ్స్, కర్నూలు. 98490 41008 [L-822305]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 9391753308 [HA-1085]
■ శాశ్వి ఇంటర్నేషనల్ స్కూల్, రాజంపేట నందు పనిచేయుటకు మ్యాథ్స్, కెమిస్ట్రీ, టీచర్స్ మరియు హాస్టల్ వార్డెన్ కావలెను. ఫ్రీ హాస్టల్, భోజన వసతి ఆకర్షణీయమైన జీతము. ఆసక్తికలవారు సంప్ర: 6300513849 [C-777460]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221898]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.